క్లుప్తంగా

ఉద్యానశాఖ అధికారిగా కె.చందన



ఆత్మకూరురూరల్: మండల ఉద్యాన శాఖ అధికారిగా కే. చందన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుంచి బదిలీపై వచ్చారు. ఉద్యాన రైతులకు తనవంతుగా సేవలందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాములపాడు: నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనుమతులున్న విత్తనాల దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన వెంటనే కచ్చితంగా రశీదు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేయవద్దని సూచించారు. ఎవరైనా విక్రయాలు చేస్తున్నట్లయితే తమకు సమాచారం ఇస్తే, అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతిలేని వారి వద్ద కొనుగోలు చేయవద్దని కోరారు.

పరామర్శ

నందికొట్కూరు: అనారోగ్యంతో మృతి చెందిన గృహసారథి కుటుంబానికి అండగా ఉంటామని శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తెలిపారు. గత నెల 21న అనారోగ్యంతో మృతి చెందిన గృహసారథి బాలనాగన్న భార్య సాలమ్మ, కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శివరామ కృష్ణారెడ్డి ఉన్నారు.

బర్రెల మందపై పెద్ద పులి దాడి



పులి దాడిలో మరణించిన బర్రె

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముష్టపల్లె గ్రామ శివారులో శుక్రవారం బర్రెల మందపై పెద్దపులి దాడి చేసింది. దాడిలో ఒక బర్రె మరణించింది. దినసరి చర్యలో భాగంగా గ్రామానికి చెందిన పశువుల మంద మేపడానికి అడవికి తీసుకెళ్లగా పంట పొలాల్లో పశువులు మేస్తుండగా హఠాత్తుగా పొదల్లోంచి వచ్చిన పులి ఒక బర్రె మెడను నోట కరచుకుని అడవిలోనికి లాక్కెళ్లేందుకు యత్నించింది. దీంతో పశువుల కాపరి, మరికొందరు పెద్దగా కేకలు వేయడంతో పెద్దపులి బర్రెను వదిలి అడవిలోకి పారిపోయింది. అయితే పులి పంజాకు బర్రె మృతి చెందింది. విషయం తెలిసిన అటవీ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు అటవీ అధికారులను కోరారు.

తప్పిన ప్రమాదం



రేకుల షెడ్డుపై వాలిన కానుగ చెట్టు

వెలుగోడు: పట్టణంలో శుక్రవారం వీచిన గాలులు వర్షం ధాటికి చెట్లు నేలకొరిగాయి. ఆత్మకూరు-నంద్యాల రహదారిలో చెక్‌పోస్టు కార్యాలయం సమీపంలో కానుగ చెట్టు వేర్లతో సహ విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మాబాషాకు చెందిన రేకుల షెడ్డుపై పడింది. అయితే చెట్టు పూర్తిస్థాయిలో షెడ్డుపై పడకపోవడంతో ప్రమాదం తప్పింది.

పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అనురాధ

ఆత్మకూరు: మన బడి.. నాడు- నేడు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని థెరిసా కళాశాలలో డివిజన్ స్థాయిలోనున్న ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమయ్యేనాటికి పనులు పూర్తి చేసి విద్యార్థులకు మంచి వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. నాడు-నేడు పనుల నోడల్ ఆఫీసర్ లలిత కుమారి, నంద్యాల జిల్లా డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్, సెక్టోరియల్ ఆఫీసర్లు, ఎంఈఓలు, హెచ్‌ఎం,ఏపీఎంలు,సీఆర్పీలు,పీఆర్టీలు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను కొలతల ప్రకారం చేయాలని ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని పాలెంచెరువు గూడెం సమీపంలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జాబు కార్డు కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి పనులు కల్పిస్తామని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా రోజువారి వేతనం అందేలా కొలతలు ఇవ్వాలని కోరారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా భూములు కలిగి జాబుకార్డు ఉన్నవారికి 150 రోజులు పనిదినాలు కల్పిస్తామని పేర్కొన్నారు.





శివపురం వద్ద రబీ పంట వ్యర్థాలను కాల్చి తొలగిస్తున్న కూలీలు, బావాపురం, నందికుంట గ్రామాల మధ్య రబీ పత్తి పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం, పొలంలో సేంద్రియ ఎరువు తోలిన దృశ్యం

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- గత పంట అవశేషాల తొలగిస్తున్న రైతులు
- కాడెద్దులు, ట్రాక్టర్లతో లో దుక్కులు, చదును చేస్తున్న అన్నదాతలు
- కొన్నిచోట్ల సేంద్రియ ఎరువులు చల్లడంలో నిమగ్నం
- పంటల సాగుకు విత్తనాలు, ఎరువుల సేకరణపై దృష్టి



నందికుంట సమీపంలో పొలాన్ని చదును చేస్తున్న రైతన్న

కొత్తపల్లి: మే నెలలోనే వర్షాలు కురవడంతో ఖరీఫ్ సాగుపై రైతన్నల్లో ఆశలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రబీ పంటల వ్యర్థాల తొలగింపు, భూములను లో దుక్కులు, చదును చేయడం, ఎరువులు తోలి వెదజల్లడంలో నిమగ్నమై ఉన్నారు. పంటల సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలో సుమారు 9వేల హెక్టార్ల సాధారణ సాగుభూమి ఉంది. దాదాపు రైతులు 7 వేల హెక్టార్లలో పొలాలను సిద్ధం చేసుకున్నారు. మరోమారు వర్షాలు పడిన వెంటనే విత్తనాలు వేసుకొనేందుకు పనులు మొత్తం పూర్తిచేసుకున్నారు. ఖరీఫ్‌లో మంచి దిగుబడులు రావాలని, భూ సారం పెంపొందాలని పశువుల ఎరువును కొనుగోలు చేసి పొలాల్లో వేస్తున్నారు. మండలంలో ఎక్కువగా ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట గ్రామాలలో రైతులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, మిరప, కంది వంటి పంటలు సాగుచేస్తారు. గువ్వలకుంట్ల, బండినాయినిపాలె, పాలెంచెరువు గూడెం, వీరాపురం, కొత్తపల్లి, శివపురం, పెద్దగుమ్మడాపురం గ్రామాలలో వర్షాధారం, చెరువులపై ఆధారపడి అధికంగా వరి పంట సాగుచేస్తారు. ఇక్కడ కూడా పొలాలు సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. తొలకరి మొదలైతే చాలు విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యేందుకు అన్నదాతలు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు అందజేస్తుంది. అవసరమైన రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇక వరి పంట సాగు చేసే రైతులు జీలుగ, పిల్లి పెసర విత్తనాలు ఆర్బీకేల్లో ఉన్నాయని వాటిని సాగు చేసి పంటకు కొద్ది రోజుల ముందు కలియదున్ని నాట్లు, విత్తనం వేస్తే భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఐటీ రంగంలో యువత రాణించాలి

నందికొట్కూరు: ఐటీ రంగంలో యువత రాణించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ఆవరణలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన 70 మంది విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించగా 19 మంది అర్హత సాధించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు హిందుస్తాన్ కంప్యూటర్ లిమిటెడ్ కార్యక్రమం ద్వారా ఐటీ రంగంలో శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం యువతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు సాయికిరణ్, ఏపీఎస్ఎస్‌డీసీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హాస్పిటల్ గుర్తింపు రద్దు చేయాలి

ఆత్మకూరు: పట్టణంలోని అశ్విని హాస్పిటల్ గుర్తింపు రద్దు చేయాలని సీపీఐ తాలుకా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి హాస్పిటల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కొత్తపల్లికి చెందిన ఓ మహిళ ప్రసవ వేదనతో హాస్పిటల్‌కు రాగా గైనకాలజిస్ట్ లక్ష్మి ప్రసన్నకు బదులు ఆమె భర్త డాక్టర్ అనంతకుమార్ యాదవ్ సిజేరియన్ చేయడంతో శిశువు చేతులు విరిగాయని చెప్పారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. డాక్టర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. పార్టీ నాయకులు ప్రతాప్, శివుడు, ప్రశాంతకుమారి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ



మారుతీనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో కౌన్సిలరు లాలు ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.2. 80 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు రూ.16 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఆ నిధులతోనే అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చాంద్‌బాషా, హమీద్, చిన్నరాజు, అశోక్, నాయకులు ఉస్మాన్‌బేగ్, జబ్బార్, రామిరెడ్డి, కుర్వ శ్రీను, బ్రహ్మయ్య, రాజు పాల్గొన్నారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి



జూపాడుబంగ్లాలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

జూపాడుబంగ్లా: రెజ్లర్లను లైంగిక వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు అరెస్టు చేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు స్వాములు, పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కర్నూలు-గుంటూరు రహదారిపై పార్టీ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. దేశానికి బంగారు పతకాలు తెచ్చిపెట్టిన మహిళా క్రీడాకారుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు నెలరోజుల నుంచి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నా మోదీ ప్రభుత్వం స్పందించకపోవటం సిగ్గుచేయటన్నారు. లోకేష్, చిన్న, హరి, రవికుమార్, ఉమేష్, ప్రభాకర్, శివరాం, అరవింద్, చరణ్, విజయ్‌కుమార్, యేసు, హరి, అబ్దుల్ పాల్గొన్నారు.

అలరించిన భజన



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురం జిల్లాకు చెందిన జి.సుబ్బిరెడ్డి, బృందం భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో శివశివ శంకరా భక్తవ శంకరా, ఓం నమఃశివాయ, పాతాళగంగమ్మ పాదాలు కడుగగా, పానగా భరణ, బ్రహ్మమురారి, అమ్మా పరమేశ్వరి తదితర భక్తిగీతాలు, అష్టకాలను ఆదినారాయణ, బాట ఆదెన్న, వెంకటరాముడు, పుల్లయ్య, ప్రసాద్, కర్రెన్న తదితరులు ఆలపించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆత్మకూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బైర్లూటీ గూడెంలో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని, తాజాగా ఉండే ఆహార పదార్థాలను భుజించాలని చెప్పారు. సర్పంచు గురవయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



తలముడిపిలో వలంటీర్లను సన్మానించిన దృశ్యం.



అలగనూరులో..

మిడుతూరు: గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని రోళ్లపాడు, అలగనూరు గ్రామ సర్పంచ్‌లు ఎస్.రామస్వామిరెడ్డి, కృష్ణవేణమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని అలగనూరు, తలముడిపి గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు అనురాధ, విజయలక్ష్మి, శాలుబాషా పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లను స్థానిక అలంకార మండపంలో కొలువుంచి విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, అలంకార పూజల అనంతరం గోమాతను ఉత్సవానికి ముందు ఉంచి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మహానంది: బండిఆత్మకూరు మండలం ఎరుకల కాలనీ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ రమాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పిల్లలు,గర్భిణులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని చెప్పారు.

అంధులకు ఆర్థిక సాయం

నందికొట్కూరు: అంధులకు సహాయార్థం బసిరెడ్డి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం అమ్మ అంధుల పాఠశాల వార్డెన్ సుధాకర్‌కు రూ.18 వేల నగదు అందజేశారు. విద్యార్థులు రూ.15 వేలు, అధ్యాపకులు రూ.3 వేలు పోగు చేసి అందించారు. కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జాన్ ఏలిషా, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ జనార్ధన్‌రావు

వెలుగోడు: పట్టణంలోని గ్రామ, వార్డు సచివాలయాలను డీఎల్‌డీఓ, స్పెషల్ ఆఫీసర్ జనార్ధనరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెలుగోడు 1,3,4,5 సచివాలయాలలో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని చెప్పారు. ఎంపీడీఓ అమానుల్లా, ఈఓ హరిలీల ఉన్నారు.

రెండు ట్రాక్టర్లు మంజూరు

జూపాడుబంగ్లా: వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద మండలానికి రెండు ట్రాక్టర్లు మంజూరయ్యాయని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండ్లెం సచివాలయం 1 పరిధిలోని జైకిసాన్ రైతుమిత్ర గ్రూపునకు, సచివాలయం-2 పరిధిలోని వైఎస్సార్ రైతు మిత్ర గ్రూపునకు ట్రాక్టర్లు మంజూరైనట్లు చెప్పారు. యూనిట్ విలువ రూ.6.45లక్షలు కాగా రూ.2లక్షల రాయితీ పోనూ మిగిలిన మొత్తాన్ని వాయిదాల ప్రకారంగా రైతులు బ్యాంకుల్లో చెల్లించాలన్నారు. ఈ ట్రాక్టర్లను ఆయా రైతుమిత్ర గ్రూపుల్లోని సభ్యులందరూ వినియోగించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే గతంలో మండలానికి 3ట్రాక్టర్లు, హార్వెస్టర్ మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: మండలంలోని చిన్న, సన్నకారు రైతులు హార్టీకల్చర్ ద్వారా తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ షేక్ రేష్మా శుక్రవారం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి 5 ఎకరాలలోపు ఉన్న చిన్న,సన్నకారు రైతులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా తోటలు సాగుచేసుకోవచ్చన్నారు. అర్హతకలిగిన వారు ఉంటే వారంలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సాగు చేసుకునే రైతులకు ఉపాధి పథకం ద్వారా మామిడి, చీని, నిమ్మ, జామ, సపోట, మునగ మొక్కలను ఉచితంగా ఇస్తామన్నారు.

కౌలు రైతు చట్టాన్ని సవరించాలి

ఆత్మకూరు: కౌలు రైతు చట్టాన్ని సవరించి భూయజమాని సంతకం తొలగించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కోరారు. శుక్రవారం పట్టణంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులుండగా కేవలం 5.70 లక్షల మందికి మాత్రమే కౌలు కార్డులున్నాయని, మిగతా వారంతా నష్టపోతున్నారని చెప్పారు. నాయకులు ఏసురత్నం, శాలు, మాబాషా, వీరన్న, రణధీర్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

ఆత్మకూరు: ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటుపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనర్సయ్య పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ, ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని మేకలబండ సమీపంలోని యాదవసత్రం వెనుక నివాసం ఉంటున్న మల్‌రెడ్డి మనీషా అదృశ్యమైనట్లు శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెల 28న ఇంటి నుంచి బయటికి వెళ్లిన మనీషా ఇంటికి రాలేదని,పలుచోట్ల విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం



పింఛన్ ఇప్పించాలని ఎమ్మెల్యే ఆర్థర్‌ను కోరుతున్న వడ్డె శ్రీనివాసులు

పగిడ్యాల: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం లక్ష్మాపురం-2 సచివాలయ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి అందిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేయడం ఆదర్శంగా నిలిచారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా పథకాల అమలును కొనసాగించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎస్సీ కాలనీలో నీటి సమస్య అధికంగా ఉందని అడ్డాకుల బిచ్చమ్మ, శేఖర్, రాముడు, లక్ష్మీదేవి, కుమారి, కొండా కృష్ణయ్య, వెంకటరమణ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌ను పిలిచి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఇళ్లు, ఇంటి స్థలం, విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు, 98జీఓ కింద ఉద్యోగాలు కావాలని ఎమ్మెల్యేను కోరారు. కేసీ కాలువపై నేలగండి వద్ద కొత్త బ్రిడ్జి మంజూరు చేయించాలని అంబటి శివశంకర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. పక్షవాతంతో ఐదేళ్లుగా మంచం పట్టిన వడ్డె శ్రీనివాసులు వికలాంగుల పింఛన్ మంజూరు చేయించాలని వేడుకున్నారు. సదరం సర్టిఫికెట్‌లో 50 శాతం వికలత్వం ఉందని వైద్యులు ధ్రువీకరించారని అయినా అధికారులు పింఛన్ రాయడం లేదని వాపోయారు.సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అబ్దుల్లాను పిలిచి పింఛన్‌కు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతీ, ఏఈలు వెంకటేశ్వర్లు, జ్యోతి, శివకుమార్, ఏఓ విజయ్ జ్యోతుకుమార్, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణ పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం




విద్యార్థులను తనిఖీచేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న దృశ్యం, పరీక్ష రాసేందుకు తరగతి గదిలో కూర్చొన్న విద్యార్థులు

జూపాడుబంగ్లా: పటిష్టమైన బందోబస్తు మధ్య పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక మోడల్ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం గేటు వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, బాత్‌రూం సౌకర్యాలతో పాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. కేంద్రం వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాన్ని నో సెల్‌ఫోన్‌జోన్‌గా ప్రకటించటంతో విధులు నిర్వర్తించేవారెవ్వరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు. మొదటి రోజుల తెలుగు సప్లిమెంటరీ పరీక్షకు 86 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 67 మంది హాజరు కాగా 19మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సువర్ణ, డిపార్ట్‌మెంటల్ అధికారి సుబ్బరాయుడు తెలిపారు.

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 46 మందికి గాను 30 హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి నాగరమేష్, డీఓ అల్లీహుసేన్ తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో 53 మంది విద్యార్థులకు 35 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి పార్వతి, డీఓ ఇమ్మానుయేలు తెలిపారు.

తక్షణమే ఉపాధి పనులు కల్పించండి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో సత్వరమే ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శుక్రవారం డ్వామా అధికారులను ఆదేశించారు. దీంతో డ్వామా అధికారులు ఎంపీడీఓ మంజులవాణికి ఫోన్‌చేసి గ్రామంలో ఎందుకు పనులు నిలిచిపోయాయనే విషయంపై ఆరా తీశారు. సర్పంచ్ తీర్మానాలపై సంతకం చేయకపోవటం వల్ల పనులకు పంచాయతీ ఆమోదం లభించక పనులు నిలిచిపోయినట్లు జిల్లా అధికారులకు వివరించారు. ప్రజల సంక్షేమార్థం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను జతపరచి గ్రామంలో పనుల ఆమోదం, మంజూరు కోసం డ్వామా పీడీకి నివేదికలు పంపామని, అనుమతి లభించిన వెంటనే గ్రామంలో పనులు ప్రారంభిస్తామని ఎంపీడీఓ చెప్పారు. గ్రామ సర్పంచ్, ఫీల్డ్‌అసిస్టెంటుకు మధ్య నెలకొన్న సమస్యల వల్ల ఉపాధి హామీ పనులకు సర్పంచ్ ఆమోదం తెలపటం లేదని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పక్షం రోజుల నుంచి పనులు నిలిచిపోవటంతో కూలీలకు గ్రామంలో ఉపాధి లభించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో పనులు ప్రారంభించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసినా ప్రయోజనం లేకపోవటంతో గ్రామస్తులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

నేడు హౌసింగ్ డే

ఆత్మకూరు: పట్టణంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. చక్రం హోటల్, మైనార్టీ హౌసింగ్ కాలనీలో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారిఫ్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఆర్‌డీఓ దాసు, హౌసింగ్ పీడీ హాజరవుతారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చాగలమర్రి: పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి మరో బైక్ వేగంగా ఢీకొట్టడంతో ఓ మహిళకు తీవ్రగాయాలైన ఘటన గొడిగనూరు గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని డి.వనిపెంట మజరా గ్రామమైన చెంచుగూడేనికి చెందిన ఇళ్ల రమణమ్మ ఆమె భర్త బయ్యన్న పని మీద ద్విచక్ర వాహనంపై చాగలమర్రికి వెళ్లి తిరిగి వస్తుండగా గొడిగనూరు గ్రామ సమీపంలో బైక్‌తో వెనుకవైపు నుంచి ఢీ కొట్టడంతో రమణమ్మ తీవ్రంగా గాయపడింది. కేరళ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు.